E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

09 - 04-2025 బుధవారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com



## తెలంగాణలో 604 కొత్త మద్యం

బ్రాండ్లకు దరఖాస్తులొచ్చాయ్.. అబ్కారీశాఖ

2లో



# సబర్మతీ ఆశ్రమంలో

## చరఖా తిప్పిన సీఎం రేవంత్ రెడ్డి

**ఈ కబురు:** గుజరాత్ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఆహ్మదాబాద్ లో జరిగే రెండు రోజుల ఏఐసీసీ ప్రత్యేక కార్యక్రమాలు, సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరయ్యేందుకు సీఎం గుజరాత్ కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్మదాబాద్ లోని సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించారు. జాతిపిత మహాత్మ గాంధీకి ఆయన నివాళులు అర్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సబర్మతీ ఆశ్రమంలో మహాత్మగాంధీ గడిపిన జీవన శైలి, ఆశ్రమ విశిష్టతల గురించి సీఎం అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సబర్మతీ అశ్రమంలో గాంధీ వాడిన చరఖాను తిప్పి దాన్ని పరిశీలించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో చూడండి.



# దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు..

# 'దోషులకు' 'ఉరి' సబబే

- జంట పేలుళ్ల కేసులో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష ఖరారు
- దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లలో 18 మంది మృతి, 131 మందికి గాయాలు
- హైకోర్టు నిర్ణయం: ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించడం
- పాకిస్థాన్‌లో తలదాచుకున్న కీలక సూత్రధారి రియాజ్ బక్తల్
- 2016లో ఉరిశిక్ష విధించిన న్యాయస్థానం, హైకోర్టులో అప్పీల్ ఖారిజు
- ఎన్ఐఏ కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది

# రాష్ట్ర ప్రజలకు గుడ్ న్యూస్..

**ఇక 10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి..**
**ఎల్లుండి నుంచే స్లాట్ బుకింగ్**



**ఈ కబురు:**
తెలంగాణలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 10 నుంచి రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ప్రారంభం అవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మొదట ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. స్లాట్ బుకింగ్ తో 10 నుంచి 15 మినిట్స్ లోనే రిజిస్ట్రేషన్ కంప్లీట్ అవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా.. వేగవంతంగా సేవలను అందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులో తీసుకొస్తున్నట్లు ఆయన ప్రకటించారు. తెలంగాణలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్ సైట్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉంచకుండా జస్ట్ 10 నుంచి 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఉన్న విషయం తెలిసిందే. అయితే మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తరువాయి 2లో

## పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం..

# కీలక నిర్ణయాలు



2లో



3లో

## రచ్చకెక్కిన టీఎంసీ ఎంపీల విభేదాలు... వీడియోలు, చాట్‌లు షేర్ చేసిన భాజపా

## ఏఐతో కాదు... అనుముల ఇంటెలిజెన్స్‌తోనే ప్రమాదం

**రాష్ట్రంలో అనుముల ఇంటెలిజెన్స్ విధ్వంసం సృష్టిస్తోందన్న కవిత**
**కాంగ్రెస్ నేతల్లా మేం ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమన్న కవిత**
**ఢిల్లీలో దీక్ష చేస్తే కేంద్రానికి అర్థమయ్యే భాషలో మాట్లాడాలని వ్యాఖ్య**
**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ప్రమాదమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్ (ఏఐ)తోనే ప్రమాదమని బీఆర్ఎస్ శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం కవిత మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేశారు.**



3లో

## డ్రాగన్‌కు ట్రంప్ షాక్.. చైనాపై టారిఫ్‌లు 104%కి పెంపు




**అమెరికా , చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదిరింది. తాజాగా చైనాపై అమెరికా భారీ స్థాయిలో మరోసారి సుంకాలు విధించింది.**

**ఈ కబురు:** అమెరికా , చైనా ల మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదిరింది. అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్ అన్నంత పనీ చేశారు. తన హెచ్చరికలను 2లో

## తెలంగాణలో నెగెటివ్ పాలసీలు..

# నెగెటివ్ పాలిటిక్స్

**తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తెదేపా తర్వాత భారాస విజయవంతంగా పాతికేళ్లు పూర్తిచేసుకుంటోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**



**ఈ కబురు,హైదరాబాద్:**
తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తెదేపా తర్వాత భారాస విజయవంతంగా పాతికేళ్లు పూర్తిచేసుకుంటోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హనుమకొండలో నిర్వహించనున్న భారాస రజతోత్సవ సభకు అనుమతివ్వాలని డీజీపీని కోరామని చెప్పారు. 3 వేల ఆర్టీసీ బస్సులు 2లో



3లో

## అకీరా పుట్టినరోజే ఇలా జరగడం బాధాకరం: పవన్ కల్యాణ్



# మీరూ టీచరేగా..

# దయచేసి జోక్యం చేసుకోండి

**ఈ కబురు,న్యూఢిల్లీ:** బెంగాల్ టీచర్ల తొలగింపు వ్యవహారంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ లేఖ రాశారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని.. ఏ తప్పూ చేయని టీచర్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరారాయన. 2016 టీచర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మోసం జరిగిందంటూ 25 వేల నియామకాలను ఇటు కలకత్తా హైకోర్టు రద్దు చేయగా.. అటు సుప్రీం కోర్టు ఆ తీర్పును సమర్థించింది. అయితే..

నియామకాల సమయంలో జరిగిన నేరాలు ఖండించదగ్గవే అయినప్పటికీ.. ఏ తప్పూ చేయనివాళ్ల ఉద్యోగాలు పోవడం తీవ్ర అన్యాయం కిందకు వస్తుందని రాహుల్ గాంధీ తరువాయి 2లో

## ఢిల్లీకి దుబాయ్ రాజు.. ప్రధాని మోదీతో చర్చించే అంశాలివే..

**ఈ కబురు,న్యూఢిల్లీ:**
దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్ నేడు(మంగళవారం) ఢిల్లీకి రానున్నారు. ఏప్రిల్ 8, 9 తేదీలలో రెండు రోజుల పాటు ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత్‌ను సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీతో సమావేశం కానున్నారు. అలాగే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు జరపనున్నారు.

దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ భారతదేశంలో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన ఇది. ఆయన వెంట యూఏఈకి చెందిన పలువురు మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు ప్రముఖ వ్యాపారవేత్తల బృందం తరువాయి 3లో



3లో

తెలంగాణలో నెగెటివ్ పాలసీలు..

# నెగెటివ్ పాలిటిక్స్

మొదటి పేజీ తరువాయి

కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

''భారాస చరిత్రలో రజతోత్సవ సభ అతి పెద్దది అవుతుంది. డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడతాం. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుంది. ప్రతి నెలా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు చేపడతాం. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చంటున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల ప్రభావం రాష్ట్రంలోని ఫార్మా, ఐటీ ఎగుమతులపై ఉంటుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలంగాణ వృద్ధిరేటు పడిపోయింది. మద్యంపై వచ్చే ఆదాయం తప్ప మిగిలినదంతా తగ్గింది.

**సీఎంగా రేవంత్ విఫలమైనందునే హైకమాండ్ జోక్యం**

రాష్ట్రంలో నెగెటివ్ పాలసీలు.. నెగెటివ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. మాజీ సర్పంచ్ నుంచి మాజీ సీఎం స్థాయి వ్యక్తులపై కేసులెలా పెట్టాలా? అని చూస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ఉద్దేశం మాకు లేదు. హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కేసుల ఉపసంహరణ సరిపోదు.. జంతువధ కారకులపై కేసులు పెట్టాలి. ఏఐ వీడియోల పేరుతో తప్పించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్' అని మేం అనవచ్చు. రెండు జాతీయ పార్టీల జుట్టు దిల్లీ చేతుల్లోనే ఉంది. 16, 17 నెలలైనా మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదు. ఇన్నిసార్లు దిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తున్నారు. సీఎంగా రేవంత్ విఫలమైనందునే కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుంటోంది.

కంచ గచ్చిబౌలి భూముల వెనుక రూ.వేలకోట్ల బాగోతం ఉంది. దీనిలో భాజపా ఎంపీ హస్తం కూడా ఉంది. ఆ వివరాలు 2, 3 రోజుల్లో చెబుతా. రేవంత్.. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి ముఖ్యమంత్రి. గోదావరి, కృష్ణా జలాల్లో విచ్చలవిడి జలదోపిడీ జరుగుతోంది. భూకంపం, భారీ వరద వచ్చినా మేడిగడ్డ చెక్కుచెదరలేదు. కేసీఆర్‌పై కోపంతో నీళ్లు వదిలేశారు.. పంటలు ఎండుతున్నాయి. ఆదిత్యానాథ్‌దాస్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. ఆయన గతంలో ఏపీ తరఫున వాదించారు. ఆదిత్యానాథ్‌దాస్ నియామకం ఏపీ ప్రయోజనాల కోసమా? భారీగా ఖర్చు చేసి టూల్ కిట్ సాయంతో సోషల్ మీడియాలో మాపై ఎదురుదాడి చేయిస్తున్నారు'' అని కేటీఆర్ విమర్శించారు.



పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం..

# కీలక నిర్ణయాలు

**ఈ కబురు ,హైదరాబాద్:**

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం.. కీలక నిర్ణయాలు పోలవరం పరాజెక్టు అథారిటీ చైర్మెన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది అథారిటీ. ఈ సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్, ఏపీ సీఈలు సుగుణాకర్, నర్సింహమూర్తి పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు వంటి తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు అధికారులు. పోలవరం ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం అనుగుణంగా తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తించే అంశాన్ని ప్రస్తావించింది తెలంగాణ ప్రభుత్వం.

పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం పడే కిన్నెరసాని, ముర్రేడువాగు సహా ఇతర ప్రవాహాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించింది ప్రభుత్వం. భద్రాచలం పట్టణం, ఆలయం, మణుగూరు భారజల కేంద్రం వద్ద వాటర్ లెవల్స్ అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే చేయాలని..ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావంపై అధ్యయనం చేయాలని కోరింది తెలంగాణ ప్రభుత్వం. కొత్తగా సర్వే అవసరం లేదని, గతంలో ఉన్న వివరాలు సరిపోతాయని ఏపీ చీఫ్ ఇంజినీర్లు వాదించగా..సంయుక్త సర్వే చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయించింది.

# రాష్ట్ర ప్రజలకు గుడ్ న్యూస్..



మొదటి పేజీ తరువాయి

తీసుకొస్తున్నట్లు మంత్రి పొంగులేటి క్లారిటీ ఇచ్చారు.

**ఇవే 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..**

మొదట దశలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పేర్లను రేవంత్ సర్కార్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్. రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లాలో రామగుండం, ఖమ్మం జిల్లాలో కూసుమంచి, అలాగే ఖమ్మం , మేడ్చల్ , మహబూబ్‌నగర్, జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్ కర్నూల్ మొత్తం 22 చోట్ల మొదట దశలో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఎక్కువ సంఖ్యలో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం జరిగే జప్యాన్ని నివారించేందుకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించామని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలు నేరుగా అధికారిక వెబ్ సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోని వారికోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు..

# దోషులకు, 'ఉరి' సబబే

**దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబుల పేలుళ్ల కేసు దాడిలో 18 మంది మృతి, 131 మందికి గాయాలు 12 ఏళ్ల తర్వాత తుది తీర్పు ఇచ్చిన హైకోర్టు**

**ఈ కబురు:**

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు హైకోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది. 2016లో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విధించిన తీర్పును సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ దోషులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను ధర్మాసనం కొట్టేసింది. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో జంట బాంబు పేలుళ్లలో 18 మంది మృతి చెందగా 131 మందికి గాయాలయ్యాయి. ఐదుగురు దోషులు ప్రస్తుతం తీహాడ్ జైలులో ఉండగా ప్రధాన సూత్రధారి రియాజ్ బక్తల్ ఇంకా పాకిస్థాన్‌లో తల దాచుకుంటున్నాడు.





**కేసులో దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ అధికారులు 5 వేల పేజీలతో అభియోగ పత్రం దాఖలు చేశారు. 2015లో విచారణ ప్రారంభించిన ప్రత్యేక న్యాయస్థానం 157 సాక్షులను ప్రశ్నించింది. అన్నింటిని పరిగణలోకి తీసుకున్న ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 2016 డిసెంబర్ 13న ఐదుగురిని దోషులుగా తేల్చింది. అతి అరుదైన కేసుగా భావించిన న్యాయస్థానం అదే నెల 19న మరణశిక్ష ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఐదుగురు దోషులు 2016 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. తీర్పును రద్దు చేయాలంటూ క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ కే.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం అప్పీలుపై విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.**

ఈ అసలేం జరిగింది? : 2013లో హైదరాబాద్‌తో పాటు దేశ ప్రజలను ఉలిక్కి పడేలా చేసిన దిల్‌సుఖ్‌నగర్ వరుస బాంబు పేలుళ్ల కేసులో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భాగ్యనగర చరిత్రలో మానని గాయంగా మిగిలిన ఘటనలో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధించింది. 2013 ఫిబ్రవరి 21న జరిగిన పేలుళ్లలో 18 మంది మృతి చెందగా 131 మందికి గాయాలయ్యాయి. 2015లో విచారణ ప్రారంభించిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం 157 మంది సాక్షులను ప్రశ్నించింది. 2016లో ఐదుగురిని దోషులుగా నిర్ధారిస్తూ ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దోషులు హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ కే.లక్ష్మణ్, జస్టిస్ పీ. శ్రీసుధలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం 45 రోజుల పాటు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. దోషులు దాఖలు చేసిన అప్పీలును కొట్టి వేసింది.

ఐదుగురు నిందితులు ప్రస్తుతం తీహాడ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని అజాజ్ షేక్ తరపు న్యాయవాది తెలిపారు. హైకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించిందని ఎన్ఐఏ తరపు న్యాయవాది వెల్లడించారు.

"చర్లపల్లిలో రెండు సంవత్సరాలు స్పెషల్ ట్రైల్ కండక్ట్ చేసిన తరువాత ఐదుగురికి మరణశిక్ష విధించిడం జరిగింది. ఏ1 రియాజ్ బక్తల్ దాక్కొని ఉన్నాడు. నిందితులు హైకోర్టులో అప్పీల్ వేశారు. సుధీర్ఘ వాదనలు విన్న జస్టిస్ కే.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది.

**పాకిస్థాన్‌లో తలదాచుకున్నకీలక సూత్రధారి : 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాప్ వద్ద రాత్రి 7 గంటల సమయంలో మొదటి పేలుడు జరిగింది. క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది. ఆ ప్రాంతమంతా రక్తమోడుతూ భీతావహంగా మారగా ఓ మహిళతో పాటు ఆమె గర్భంలో ఉన్న శిశువు సైతం గాయాలపాలవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలిచింది. ఘటనపై తొలుత కేసు నమోదు చేసిన సరూర్ నగర్ పోలీసులు అదే ఏడాది మార్చి 13న ఎన్ఐఏకు బదిలీ చేశారు. ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థ పేలుళ్లకు పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో గుర్తించింది. యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్‌లను 2013లోనే ఇండో నేపాల్ సరిహద్దు వద్ద అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా బిహార్‌కు చెందిన తహసీన్ అక్తర్, పాకిస్థాన్‌కు చెందిన జియా ఉర్ రెహమాన్‌లను 2014 మేలో రాజస్థాన్‌లో అరెస్ట్ చేశారు. వీరితో పాటు పుణేకి చెందిన అజీజ్ షేక్‌ను సైతం ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. పేలుళ్లకు కీలక సూత్రధారి మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ బక్తల్ విచారణలో గుర్తించారు. రియాజ్ బక్తల్ పాకిస్థాన్‌లో తలదాచుకున్నట్లు దర్యాప్తులో తేలింది.**

# మీరూ టీచరేగా.. దయచేసి జోక్యం చేసుకోండి

మొదటి పేజీ తరువాయి

అంటున్నారు. ఏ తప్పు చేయకుండా చట్టపరంగా ఉద్యోగాలు పొందిన వాళ్లు సైతం నష్టపోవడం ఇక్కడ బాధాకరం. దాదాపుగా దశాబ్దంపాటుగా విధులు నిర్వహిస్తున్న ఈ కళంకం లేని టీచర్లను తొలగించడం.. విద్యా వ్యవస్థకు ఆటంకం కలిగించడమే అవుతుంది. అంతేకాదు.. వాళ్ల కుటుంబాలూ ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతాయి.

గతంలో మీరూ ఓ టీచరే కదా. కాబట్టి.. ఈ మానవతప్పిదం కారణంగా జరుగుతున్న అన్యాయాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. ఏ మోసానికి, తప్పునకు పాల్పడకుండా ఉద్యోగాలు సాధించిన వాళ్లను.. తిరిగి కొనసాగించేలా ప్రభుత్వాన్ని కోరతారని మీకు విజ్ఞప్తి చేస్తున్నా అని లేఖలో రాష్ట్రపతి ముర్మును రాహుల్ గాంధీ కోరారు. ఈ లేఖను తన ఎక్స్ ఖాతాలోనూ పోస్ట్ చేశారాయన.



# కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది రేవంతే: బండి సంజయ్

**భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నదే సీఎం రేవంత్‌రెడ్డి అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు.**

ఈ కబురు,హైదరాబాద్:

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది సీఎం రేవంత్‌రెడ్డేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ''నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారు. హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారు. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, భారాస ఎంపీలతో ఓటు వేయించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసే మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ భారాస అభ్యర్థిని బరిలోకి దించలేదు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదు. కేటీఆర్, రేవంత్ ఏకమై భాజపాను దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? భూదందా, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపే మోదీ సర్కార్ కేంద్రంలో ఉంది'' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# తెలంగాణలో 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులొచ్చాయ్.. అబ్కారీశాఖ



**రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలంగాణ అబ్కారీ శాఖ వెల్లడించింది.**

**ఈ కబురు,హైదరాబాద్:**

రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలంగాణ అబ్కారీ శాఖ వెల్లడించింది. ఇందులో 331 రకాల స్వదేశీ లిక్కర్ బ్రాండ్లు కాగా.. 273 రకాల విదేశీ లిక్కర్ బ్రాండ్లకు దరఖాస్తుల వచ్చాయని పేర్కొంది. 47 కొత్త కంపెనీల నుంచి 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు రాగా.. 45 పాత కంపెనీల నుంచి 218 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

తెలంగాణలో 604 కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం సరఫరా కంపెనీలు దరఖాస్తు చేసినట్లు ఆబ్కారీ శాఖ తెలిపింది. దేశీయ, విదేశీ మద్యం బ్రాండ్ల కోసం టీజీబీసీఎల్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ.. ఫిబ్రవరి 23న నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొంది. తెలంగాణలో తొలిసారిగా కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల కోసం 47 కొత్త కంపెనీలు 386 రకాల మద్యం బ్రాండ్లకు దరఖాస్తు చేసుకున్నాయంది. ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ వివరించారు. ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం కొత్త బ్రాండ్లకు ప్రభుత్వ ఆమోద ముద్ర పడిన తర్వాత అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

డ్రాగన్‌కు ట్రంప్ షాక్..

# చైనాపై టారిఫ్‌లు 104%కి పెంపు

మొదటి పేజీ తరువాయి

చైనా పెడచెవిన పెట్టడంతో తాజాగా చైనాపై భారీ స్థాయిలో మరోసారి సుంకాలు విధించారు. దీంతో చైనా వస్తువులపై విధించిన సుంకాలు 104 శాతానికి చేరాయి. ఇవి ఏప్రిల్ 9 నుంచి అమలులోకి రానున్నాయని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ వెల్లడించారు. ఇటీవల చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో.. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34శాతం అదనపు సుంకం విధించాలని చైనా నిర్ణయించింది. దీంతో భగ్గుమన్న ట్రంప్.. ఏప్రిల్ 8లోగా చైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. లేకుంటే అదనంగా మరో 50 శాతం ప్రతీకార సుంకం విధిస్తానన్నారు. ఇచ్చిన గడువులోగా చైనా స్పందించకపోవడంతో తాను చెప్పినట్లుగానే చేశారు. అదనంగా మరో 50 శాతం సుంకాలు పెంచుతున్నట్లు అమెరికా తాజాగా ప్రకటించింది. ట్రంప్ నిర్ణయంపై చైనా ఇంకా స్పందించలేదు.

పలు దేశాలు తమ వస్తువులపై అధిక సుంకాలు విధిస్తూ తమ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్నాయని ట్రంప్ పలు సార్లు ఆరోపించిన విషయం తెలిసిందే. అన్ని దేశాలు తమ వస్తువులపై సుంకాలు తగ్గించాలని గత కొన్ని రోజులుగా పేర్కొంటున్నారు. ఇటీవల అన్నిదేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాలు విధిస్తూ వచ్చింది. ఇటీవల పెంచిన సుంకాలతో కలిసి చైనాపై మొత్తం సుంకాలు 54 శాతానికి చేరుకున్నాయి. తాజాగా మరో 50 శాతం పన్నులు పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించింది. దీంతో చైనాపై మొత్తం సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి.



## ఢిల్లీకి దుబాయ్ రాజు.. ప్రధాని మోదీతో చర్చించే అంశాలివే..

మొదటి పేజీ తరువాయి

ఉండనుంది. ఏప్రిల్ 8న ప్రధాని నరేంద్ర మోదీ.. షేక్ హమ్దాన్ కోసం విందును ఏర్పాటు చేశారు. అనంతరం జరిగే సమావేశంలో ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, రక్షణ, సాంస్కృతిక సహకారంపై చర్చించనున్నారు. ఏప్రిల్ 9న షేక్ హమ్దాన్ ముంబైకి వెళ్లనున్నారు. అక్కడ ఆయన భారత్, యూఏఈలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనుంది.

**ప్రధాన అజెండా**

**1. వాణిజ్య సంబంధాల విస్తరణ**

భారత్‌యూఏఈ మధ్య వాణిజ్యం 202324లో 85 బిలియన్ డాలర్లను దాటింది. దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్ తన పర్యటనలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, కొత్త ఒప్పందాలపై చర్చలు చేయనున్నారు.

**2. పెట్టుబడుల పెంపు**

భారతదేశంలోని మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్ సిటీలు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో యూఏఈ నుంచి పెట్టుబడులను పెంచేందుకు గల అవకాశాలను అన్వేషించనున్నారు.

**3. రక్షణ సహకారం**

షేక్ హమ్దాన్ యూఏఈ రక్షణ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నందున భారత్‌యూఏఈ మధ్య రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడంపై రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చలు జరపనున్నారు.

**4. స్టార్టప్ ఇకోసిస్టమ్**

భారతీయ స్టార్టప్‌లు దుబాయ్‌లోని పెట్టుబడిదారుల మధ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై చర్చలు జరపనున్నారు.

**5. సాంస్కృతిక సంబంధాలు**

రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరు దేశాధినేతలు చర్చించనున్నారు.

## అకీరా పుట్టినరోజే ఇలా జరగడం బాధాకరం: పవన్ కల్యాణ్



**హైదరాబాద్, ఈ కబురు:** సింగపూర్‌లో తన చిన్నకొడుకు మార్క్ శంకర్ పవనోవిచ్ ప్రమాదానికి గురి కావడంపై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ప్రమాద తీవ్రత ఇంతలా ఉంటుందని ఊహించలేదని.. తన కొడుకుకు గాయాలైన మాట వాస్తవమేనని ధృవీకరించారాయన. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు.

ఉదయం అరకు పర్యటనలో ఉండగా నాకు ఫోన్ వచ్చింది. సింగపూర్ హైకమిషనర్ సమాచారం అందించారు. నా కొడుకు మార్క్ శంకర్ స్కూల్‌లో ప్రమాదం జరిగింది. మొదట చిన్నపాటి అగ్ని ప్రమాదం అనుకున్నా. కానీ, ప్రమాద తీవ్రత ఇంత ఉంటుందని ఊహించలేదు. 30 మంది పిల్లలు సమ్మర్ క్యాంప్‌లో ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఓ పసిబిడ్డ చనిపోయింది. నా కుమారుడు మార్క్ శంకర్‌కు చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లినట్లు తెలిసింది. ప్రధాని మోదీ ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. నా పెద్దకొడుకు అకీరా పుట్టిన రోజే చిన్నకొడుక్కి ఇలా జరగడం బాధాకరం'' అని పవన్ అన్నారు.

సింగపూర్‌లో నా కుమారుడి అగ్నిప్రమాదంపై స్పందించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. అలాగే సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ సహా అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు అని పవన్ అన్నారు.

ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 9,45గం. ప్రాంతంలో సింగపూర్ రివర్ వ్యాలీ రోడ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో బడిలో 80 మంది పిల్లలు ఉన్నారు. అరగంటపాటు శ్రమించిన ఫైర్ సిబ్బంది మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి మరణించగా.. 15 మంది పిల్లలు, నలుగురు స్టాఫ్ గాయపడ్డారు. ఈ ఘటనపై అక్కడి అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. పవన్‌అన్నాలెజినోవాలకు కూతురు పోలేనా అంజనా పవనోవా, కొడుకు మార్క్ శంకర్ పవనోవిచ్ సంతానం.





## ఏఐతో కాదు... అనుముల ఇంటెలిజెన్స్‌తోనే ప్రమాదం

**ఈ కబురు:** ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని ఎద్దేవా చేశారు. అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని మండిపడ్డారు. వారు పక్కకు తప్పుకుంటేనే రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. ప్రజలను మోసం చేయడమే అనుముల ఇంటెలిజెన్స్ పని అని విమర్శించారు.

బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో కులగణన జరిగిందని, ఆ వివరాలు కూడా బహిర్గతం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల్లా తాము ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధిక దీక్ష చేస్తామని ఆమె అన్నారు.

బిల్లులను ఆమోదించి నాలుగు వారాలవుతోందని, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటో చెప్పాలని కవిత నిలదీశారు. బిల్లుల ఆమోదం తర్వాత అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళతామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఆ పనిచేయలేదని విమర్శించారు. బీజేపీతో రేవంత్ రెడ్డికి స్నేహం ఉందని, అందుకే అఖిలపక్షాన్ని తీసుకువెళ్లడం లేదని ఆరోపించారు.

ముఖ్యమంత్రి ఢిల్లీ దీక్షలో తెలుగులో మాట్లాడారని, కానీ అక్కడ దీక్ష చేస్తే కేంద్రానికి అర్థమయ్యే భాషలో మాట్లాడాలని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 11న పూలే విగ్రహంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

# మియాపూర్ లో

# ఘోర రోడ్డు ప్రమాదం

**విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మీదకు దూసుకువెళ్లిన లారీ**
**ఒకరు మృతి... మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**
**మద్యం మత్తులో లారీ డ్రైవర్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** మద్యం మత్తులో ఉన్న ఓ లారీ డ్రైవర్ మియాపూర్ లో బీభత్సం సృష్టించాడు. అతివేగంగా దూసుకువచ్చిన లారీ అదుపుతప్పి మియాపూర్ మెట్రో సమీపంలో ట్రాఫిక్ పోస్టును ఢీకొట్టగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మీద నుంచి లారీ వెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఓ హోంగార్డు తీవ్ర గాయాలతో మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఐడిఏ బొల్లారంలో నివాసం ఉండే సింహాచలం (42) మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఇదే పోలీస్ స్టేషన్ లో బిహెచ్ ఈఎల్ కు చెందిన వికేందర్, రాజేంద్రనగర్ కు చెందిన రాజవర్ధన్ లు కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. కాగా విధుల్లో భాగంగా సోమవారం రాత్రి వికేందర్, రాజవర్ధన్ లు హోం గార్డు సింహాచలంతో కలిసి మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని పిల్లర్ నెంబరు 600 వద్ద గల యూటర్న్ మీద విధులు నిర్వహిస్తూన్నారు. ఈ క్రమంలో రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కూకట్ పల్లి వైపు నుంచి చందానగర్ వైపు వెళ్తున్న లారీ (ఏపి15 వై4069) మితిమీరిన వేగంతో దూసుకువచ్చింది. లారీ స్పీడ్ అదుపుతప్పి యూటర్న్ వద్ద ఉన్న ట్రాఫిక్ పోస్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మీద ట్రాఫిక్ పోస్టు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ వేగం ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ పోస్టు లారీ మధ్యలోకి దూసుకుపోయింది. ట్రాఫిక్ పోస్టు మీద పడడంతో హోంగార్డు సింహాచలం తలకు, కానిస్టేబుల్ వికేందర్ చేతులు, కాళ్లకు, రాజవర్ధన్ కుడి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు స్థానికులతో కలిసి వీరిని మియాపూర్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వీరిని ఏఐజీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే హోంగార్డు సింహాచలం మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. రాజవర్ధన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని మియాపూర్ పోలీసులకు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన శ్రీనివాస్(48) గా లారీ డ్రైవర్ ను గుర్తించిన పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, 389 ఎంఎల్ వచ్చింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ వికేందర్ ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు డ్రైవర్ ను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు సింహాచలంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలిలో ఉన్న రెండు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి.



ప్రమాద స్థలిలో లారీ కిందకు దూసుకువెళ్లిన ట్రాఫిక్ పోస్టు, వాహనాలు


హోంగార్డు సింహాచలం (ఫైల్ )


సింహాచలం మృతదేహం

## రచ్చకెక్కిన టీఎంసీ ఎంపీల విభేదాలు...

# వీడియోలు, చాట్‌లు షేర్ చేసిన భాజపా

**తృణమూల్ కాంగ్రెస్ కు ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. నేతల మధ్య జరిగిన ఘర్షణ నెట్టింటికి ఎక్కింది.**

**ఈ కబురు:** తృణమూల్ కాంగ్రెస్ లోని అంతర్గత పోరు రచ్చకెక్కింది. లీకైన వీడియోలు, వాట్సప్ చాట్‌లను భాజపా షేర్ చేయడంతో నేతల మధ్య ఘర్షణ బయటకు వచ్చింది. కమలం పార్టీ ఐటీ సెల్ ఇంఛార్జి అమిత్ మాలవీయ వాటిని షేర్ చేశారు. ఎన్నికల సంఘం కేంద్రకార్యాలయం వద్ద సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, మరో ఎంపీ మధ్య ఈ గొడవ జరిగినట్లు వెల్లడవుతోంది.

మాలవీయ పేర్కొన్న దాని ప్రకారం.. ఒక ప్రజెంటేషన్‌ను సమర్పించడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఈసీ కార్యాలయానికి వెళ్లింది. ఈసీ ఆఫీస్‌కు వెళ్లడానికి ముందు వినతిపత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని పార్టీ ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ ఎంపీ ఆ సమావేశానికి రాకుండా నేరుగా ఈసీ వద్దకు వెళ్లారు. ఇది ఇద్దరు ఎంపీల మధ్య గొడవకు దారితీసింది. ఆ ఘర్షణను ఆపేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాలని పిలిచేవరకు వెళ్లింది. భాజపా షేర్ చేసిన వీడియోలో.. కల్యాణ్ బెనర్జీ మరో ఎంపీపై ఆగ్రహంతో ఊగిపోతున్నట్లుగా ఉంది. ''ఇదంతా పబ్లిక్ ప్లేస్. కాస్త సంయమనం పాటించండి'' అని అక్కడున్న టీఎంసీ నేత డెరెక్ ఓబ్రిన్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.



మీడియాలో ప్రసారమవుతుందని వారించినా ఆయన వినలేదు. ఈ వ్యవహారం తర్వాత పార్లమెంట్ సభ్యులు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసుకున్నారు. ఇక మాలవీయ షేర్ చేసిన చాట్ ప్రకారం.. 'ఏఐటీసీ ఎంపీ 2024' పేరిట ఉన్న వాట్సప్ గ్రూప్‌లో కల్యాణ్ బెనర్జీ, కీర్తి ఆజాద్ మధ్య వాగ్వాదం నడిచింది. వారి చాటింగ్‌లో ఒక మహిళ ప్రస్తావన కూడా వచ్చింది. సీనియర్ ఎంపీ ప్రవర్తన కారణంగా పార్లమెంట్ మహిళా సభ్యురాలు ఆ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారంపై టీఎంసీ నేత సౌగతారాయ్ స్పందించారు. '' ఇలాంటివి జరిగిఉండాల్సింది కాదు. ప్రతిపార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలి. ఈ గొడవ జరిగినప్పుడు నేను అక్కడ లేను. కానీ మహువా కన్నీళ్లు పెట్టుకోవడం చూశాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది'' అని రాయ్ వెల్లడించారు. కల్యాణ్‌తో జరిగిన వాగ్వాదంలో ఉన్న మరో ఎంపీ మహువా మొయిత్రా అని తెలుస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్, ఈ లీక్స్‌పై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా కలత చెందారని, వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయొద్దని నేతలకు ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే.. వాట్సప్ చాట్‌లలో పేర్కొన్న మహిళ ఎవరో తెలియాల్సి ఉందని మాలవీయ తన పోస్టులో పేర్కొనడం గమనార్హం.

ఇదిలా ఉంటే.. వక్ఫ్ బిల్లుపై గతంలో జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా కల్యాణ్ నిగ్రహాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆయనకు, భాజపా ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం జరగ్గా.. తీవ్ర ఆగ్రహానికి గురైన టీఎంసీ ఎంపీ పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీంతో అతడి చేతికి గాయమైంది.

# బంగ్లాకు తిరిగొస్తా..

## అందుకే దేవుడు నన్ను బతికించాడు: షేక్ హసీనా

**భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా త్వరలోనే తన దేశానికి తిరిగి వస్తానని ఆవామీ లీగ్ పార్టీ కార్యకర్తలకు హామీ ఇచ్చారు.**

**ఈ కబురు:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా మళ్లీ దేశానికి తిరిగి రానున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలతో జరిగిన సంభాషణ సందర్భంగా హసీనా హామీ ఇచ్చారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తీవ్ర విమర్శలు చేశారు.

''ఏదో ఒక కారణం వల్లే ఆ దేవుడు నన్ను ఇంకా బతికించాడు. అవామీ లీగ్ పార్టీ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నవారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది. తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉంచండి. నేను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాను'' అని షేక్ హసీనా భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా మహమ్మద్ యూనస్‌పై మండిపడ్డారు. ''యూనస్‌కు ప్రజలంటే ప్రేమ లేదు. అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి ఆయన విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపి వచ్చారు. ఆ సమయంలో ఆయన తీరును అర్థం చేసుకోలేకపోయాం. అతడికి దేశం ఎంతో సహాయం చేసింది'' అని అన్నారు.



**బంగ్లాలో ఎన్నో నేరాలు..**

''యూనస్ వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అతడికి అధికారంపై వ్యామోహం మాత్రమే ఉంది. వారి సారథ్యంలో బంగ్లా ప్రస్తుతం ఉగ్రవాద దేశంగా మారింది. మన నాయకులు, కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కళాకారులు ఇలా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయి. కానీ, మీడియాకు చెందిన వ

**వారికి శిక్ష తప్పదు..**

తన తండ్రి, బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబర్ రెహమాన్ సహా తన కుటుంబం మొత్తం హత్యలకు గురైన సంఘటనలను షేక్ హసీనా గుర్తుచేసుకున్నారు. ''ఒక్క రోజులోనే నా తండ్రి, తల్లి, సోదరుడిని కోల్పోయాను. నాడు వారు మమ్మల్ని దేశంలోకి రానివ్వలేదు. మీ సొంత వారిని కోల్పోయి ఇప్పుడు మీరంతా అనుభవిస్తున్న బాధను నేను అర్థం చేసుకోగలను. నా ద్వారా మీ అందరికీ మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకుంటున్నాడేమో. అందుకే నన్ను ఇంకా రక్షిస్తున్నాడు. నేను తిరిగి వచ్చాక అన్యాయం చేసిన వారందరికీ కఠిన శిక్ష అమలు చేస్తా'' అని హసీనా ప్రతినబూనారు.



# టాయ్ పరిశ్రమకు 'టారిఫ్'ల ప్రయోజనం!

**చైనా, వియత్నాంపై అధిక సుంకాల ఎఫెక్ట్..**

**న్యూఢిల్లీ:** ట్రంప్ టారిఫ్ వార్ సెగ అన్నిదేశాలకూ గట్టిగానే తగులుతోంది. అయితే భారత్‌తో పోలిస్తే చైనా, వియత్నాం తదితర పోటీ దేశాలపై అధిక సుంకాలు విధించడం మన టాయ్ పరిశ్రమ దీన్ని సదావకాశంగా మలుచుకోవడానికి సిద్ధమవుతోంది. ఇతర దేశాల సంస్థలతో జాయింట్ వెంచర్‌ల ఏర్పాటు ద్వారా తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు దేశీ కంపెనీలు ఇప్పటికే పని మొదలు పెట్టాయని ఎగుమతిదారులు చెబుతున్నారు. ఇతర దేశాలపై అధిక టారిఫ్‌ల ప్రభావంతో మన ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూరనుందని, దీంతో ఈ వాణిజ్య యుద్ధంలో భారత్ విజయం సాధించనుందని కూడా వారు అంటున్నారు.

ఆసియాలో చైనాపై 54 శాతం, బంగ్లాదేశ్‌పై 37 శాతం, థాయ్‌లాండ్‌పై 36 శాతం, ఇండోనేషియాపై 32 శాతం చొప్పున ట్రంప్ భారీగా సుంకాలను వడ్డించిన సంగతి తెలిసిందే. భారత్‌పై మాత్రం 26 శాతం టారిఫ్‌లతో సరిపెట్టారు. 'ఇది మనకు భారీగా అవకాశాలను అందించనుంది. ఎందుకంటే వియత్నాం 6 బిలియన్ డాలర్లు, చైనా 80 బిలియన్ డాలర్ల చొప్పున ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. భారతీయ టాయ్స్‌తో పోలిస్తే వారి వస్తువులకు అధిక సుంకాలు పడతాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బడా టాయ్ సంస్థలన్నీ భారత్‌లో ప్లాంట్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నాయి' అని ప్లేగ్రో టాయ్స్ ఇండియా సీఈఓ మను గుప్తా పేర్కొన్నారు.

**34.8 కోట్ల డాలర్ల ఎగుమతులు..**

పరిశ్రమ వర్గాల గణాంకాల ప్రకారం గడిచిన మూడేళ్లుగా భారత్ నుంచి 32.6-34.8 కోట్ల డాలర్ల విలువైన టాయ్ ఎగుమతులు జరుగుతున్నాయి. అమెరికాతో వీలైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే, భారతీయ టాయ్ సంస్థలు యూఎస్‌కు తమ ఎగుమతులను పెంచేందుకు దోహదం చేస్తుందని కూడా గుప్తా అభిప్రాయపడ్డారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఇప్పుడు రంగాల వారీగా పాలసీలను రూపొందిస్తున్నాయన్నారు. కాగా, బడ్జెట్లో టాయ్ పరిశ్రమ కోసం ప్రకటించిన జాతీయ యాక్షన్ ప్లాన్ ఈ రంగానికి మరింత దన్నుగా నిలవనుందని సన్‌లార్డ్ గ్రూప్ ప్రమోటర్ అమితాభ్ ఖర్బందా పేర్కొన్నారు.

టాయ్ పరిశ్రమకు 'టారిఫ్'ల ప్రయోజనం! 2
ఇతర దేశాల ఆధిపత్యంతో భారత్ అనేక ఏళ్లుగా నికర టాయ్స్ దిగుమతిదారుగానే కొనసాగుతోంది. గడిచిన దశాబ్దకాలానికి పైగా చైనా పైనే పూర్తిగా ఆధారపడుతూ 76 శాతం మేర టాయ్స్ దిగుమతి చేసుకుంటోంది. అయితే, ఈ పరిస్థితి క్రమంగా మారుతోంది. 2012-13లో భారత్ చైనా నుంచి 21.4 కోట్ల డాలర్ల టాయ్స్ దిగుమతి చేసుకోగా, 2023-24లో ఇది 4.16 కోట్ల డాలర్లకు దిగొచ్చింది. అంటే దాదాపు 94 శాతం దిగుమతలు కాస్తా, 64 శాతానికి తగ్గాయి. అంతర్జాతీయ టాయ్ మార్కెట్లో భారత్ పోటీతత్వానికి ఇది నిదర్శనమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.



## భారీ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

భారీ నష్టాల నుంచి లాభాల బాట పట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లో భారీ లాభాల్లోనే ముగిశాయి. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి సెన్సెక్స్ 1,135.68 పాయింట్లు లేదా 1.55 శాతం లాభంతో.. 74,273.58 వద్ద, నిఫ్టీ 374.25 పాయింట్లు లేదా 1.69 శాతం లాభంతో.. 22,535.85 వద్ద నిలిచాయి.

సిల్లీ మాంక్స్ ఎంటర్టైన్మెంట్, కీనోట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ లిమిటెడ్, టెసిల్ కెమికల్స్ అండ్ హైడ్రోజన్, బినాని ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. డీసీఎమ్ ఫైనాన్షియల్, ఢిల్లీవరీ, ప్రోకాట్ మెరిడియన్, బోధి ట్రీ మల్టీ మీడియా, ది వెస్ట్రన్ ఇండియా ప్లైవుడ్స్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## గోల్డెన్ ఛాన్స్! తగ్గిన బంగారం ధర.. ఎంతంటే..

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర ఇటీవలి కాలంలో క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారంతో పోలిస్తే మంగళవారం కొంత తగ్గి కొనుగోలుదారులకు మరింత ఊరట కల్పించింది. వివిధ ప్రాంతాల్లో ఈ రోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.**

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.82,250 (22 క్యారెట్స్), రూ.89,730 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. సోమవారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.600, రూ.650 తగ్గింది.

చెన్నైలో మంగళవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.600, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.650 తగ్గింది. దీంతో గోల్డ్ రేటు రూ.82,250 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.89,730 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.

దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే తగ్గింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.600 దిగి రూ.82, 400కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.650 తగ్గి రూ.89,880 వద్దకు చేరింది.

వెండి ధరలు
బంగారం ధరలు మంగళవారం తగ్గినా వెండి ధరలు మాత్రం స్థిరంగానే ఉన్నాయి. సోమవారం ముగింపు ధరలతో పోలిస్తే ఏమాత్రం కదలాడకుండా నిలకడగా ఉన్నాయి. దాంతో కేజీ వెండి రేటు రూ.1,03,000 వద్ద స్థిరంగా ఉంది.

# తగ్గిన భోజనం ధరలు

**వెజిటేరియన్లూ.. మీ భోజనం ఖర్చులు తగ్గాయ్! నాన్ వెజిటేరియన్లూ.. మీకో శుభవార్త. నాన్ వెజ్ మీల్స్ ఖర్చు కూడా తగ్గింది. క్రిసిల్ రేటింగ్ సంస్థ ఈమేరకు రిపోర్ట్ వెలువరించింది. ఈ ధరల తగ్గింపునకు ప్రధాన కారణం.. వెజిటేరియన్ అన్నివంటల్లో దాదాపుగా వాడే టమాటా ధరలు తగ్గడమేనని నివేదిక తెలిపింది. నాన్‌వెజ్ మీల్స్ తగ్గింపునకు చికెన్ ధరలు దిగిరావడమే కారణమని పేర్కొంది.**

క్రిసిల్ నివేదికలోని వివరాల ప్రకారం.. మార్చిలో ఇంట్లో వండిన థాలీ ధర వరుసగా ఐదోసారి తగ్గింది. దాంతో ఇది రూ.26.6కు చేరుకుంది. ముఖ్యంగా టమాటా ధరలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. మార్చిలో బ్రాయిలర్ చికెన్ ధరలు తగ్గడంతో మాంసాహార థాలీ ధర కూడా రూ.54.8కి చేరింది. శాఖాహార థాలీలో రోటీ, అన్నం, పప్పు, కూరగాయలు..వంటివి ఉంటాయి. ఈ భోజనాన్ని ఇంట్లో తయారు చేయడానికి సగటు ఖర్చు మార్చిలో రూ.26.6కు పడిపోయింది.





**భోజన ఖర్చులు క్షీణించడం కొన్ని వర్గాల వారికి ఆహార ద్రవ్యోల్బణం విస్తృతంగా తగ్గేలా చేసింది. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి ఇతర కూరగాయల ధరలు కూడా తగ్గడంతో ఈమేరకు ఉపశమనం కలిగినట్లయింది. ఇంట్లో వండిన భోజనంపై ఆధారపడే కుటుంబాలకు ఇది ఎంతో మేలు కలిగిస్తుంది. నాన్ వెజిటేరియన్ థాలీ ధరలు ప్రధానంగా చికెన్‌పై ఆధారపడి ఉంటాయి.**

**బ్రాయిలర్ చికెన్ ధరల్లో నిత్యం హెచ్చుతగ్గులు నమోదవుతుంటాయి. మార్చిలో బర్డ్‌ఫ్లూ భయాలు అధికం కావడంతో భారీగా ధరలు తగ్గాయి. ఇది నాన్‌వెజ్ థాలీ తగ్గుదలకు కారణమైంది. మధ్యలో చికెన్ ధరలు ఒడిదొడుకులకులోనైనా చౌకగా కూరగాయలు లభ్యత ఉండడంతో ఖర్చులను భర్తీ చేసేందుకు తోడ్పడింది.**

# గ్రూప్ టికెట్ బుకింగ్ గురించి తెలుసా రూల్స్ ఇవే..

**ట్రైన్ జర్నీ అనగానే.. ఐఆర్‌సీటీసీ లేదా ఇతర యాప్‌లలో టికెట్ బుక్ చేసేస్తారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్ వచ్చిన తరువాత.. టికెట్ బుకింగ్ సెంటర్లకు వెళ్లడమే తగ్గిపోయింది. అయితే ఆన్‌లైన్‌లో ఒకసారికి ఆరుమంది కంటే ఎక్కువ బుక్ చేసుకోవడానికి వీలు కాదు. అలాంటప్పుడు చాలామంది వివాహ వేడుకలకు లేదా పాఠశాల విహారయాత్రలకు వెళ్లాలంటే.. అప్పుడు ఎలా బుక్ చేసుకోవాలనే విషయాన్ని ఇక్కడ తెలుసుకుందాం.**

ఆన్‌లైన్‌లో మళ్ళీ మళ్ళీ బుక్ చేసుకుంటే.. ఎక్కువ మందికి టికెట్స్ బుక్ చేసుకోవచ్చు. అయితే అందరికి ఒకేదగ్గర లేదా ఒకే బోగీలో సీట్లు దొరుకుతాయని మాత్రం చెప్పలేము. కాబట్టి ఎక్కువ మందికి టికెట్స్ బుక్ చేసుకోవాలంటే ఉత్తమమైన మార్గం.. బుకింగ్ సెంటర్లకు వెళ్లడమే.

ఆఫీస్, మతపరమైన యాత్రలు, వివాహం లేదా కుటుంబ సమూహాలతో కలిసి ట్రైన్ జర్నీ చేయాలనుకునే వారికి గ్రూప్ బుకింగ్ సౌకర్యం అందిస్తోంది.

ప్రస్తుత ఒకేసారి 50 నుంచి 100 మంది ప్రయాణికులకు బల్క్ బుకింగ్‌ను ఐఆర్‌సీటీసీ అనుమతిస్తుంది.

**బల్క్ బుకింగ్ సర్వీస్ కింద టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి సంబంధిత అధికారులకు అభ్యర్థన లేఖను సమర్పించడం తప్పనిసరి. ఒక పాఠశాల / సంస్థ / విభాగం ఈ యాత్రను స్పాన్సర్ చేస్తుంటే.. వారికి సంబంధించిన సర్టిఫికేట్‌ను అభ్యర్థన లేఖతో పాటు అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. వివాహ వేడుకలకు సంబంధించిన వారు అయితే.. వెడ్డింగ్ కార్డు లేదా నోటరీ చేసిన అఫిడవిట్‌ను అభ్యర్థన లేఖతో ఇవ్వాలి.**
**డాక్యుమెంట్స్ మాత్రమే కాకుండా.. ప్రయాణించే వ్యక్తుల పేర్లు, వయసు, లింగం, ఇతర వివరాలతో ప్రయాణీకుల జాబితాను అందించాలి. టిక్కెట్లను బుక్ చేసుకునే వ్యక్తి తన ఐడీ కార్డు ఫోటోకాపీని ఇవ్వాలి. బల్క్ టికెట్ బుకింగ్ చేసుకోవాలనుకునే వారు.. ఉదయం 8:00 గంటల నుంచి 9:00 వరకు మాత్రమే బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.**



ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే.. అన్ని రైల్వే స్టేషన్లలోనూ ఈ బల్క్ బుకింగ్ ఆప్షన్స్ అందుబాటులో ఉండదు. బల్క్ బుకింగ్ చేసుకోవాలనుకువారు ముందుగా.. సమీపంలోని స్టేషన్‌లోని చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ లేదా కంట్రోలింగ్ ఆఫీసర్‌ను సంప్రదించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా ఈ బల్క్ బుకింగ్స్ అనేది న్యూఢిల్లీలో బల్క్ బుకింగ్ రిజర్వేషన్ కాంప్లెక్స్, IRCA భవనంలో జరుగుతుంది. ఇది కూడా నామినేటెడ్ కౌంటర్లలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. కాబట్టి దీని గురించి ముందుగానే తెలుసుకోవడం ఉత్తమం.

## టయోటా హైరైడర్ ఇప్పుడు సరికొత్త ఫీచర్లతో: ధర ఎంతంటే?


**ఇండియన్ మార్కెట్లో ఇప్పటికే అమ్మకానికి ఉన్న టయోటా క్రూయిజర్ హైరైడర్.. ఇప్పుడు మరికొన్ని కొత్త ఫీచర్లతో దేశీయ విఫణిలో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని టయోటా కిర్లోస్కర్ మోటార్స్ వెల్లడించింది.**

సరికొత్త టయోటా క్రూయిజర్ హైరైడర్ ఇప్పుడు.. ఆరు ఎయిర్‌బ్యాగ్స్ పొందుతుంది. ఈ సేఫ్టీ ఫీచర్ అన్ని వేరియంట్లలోనూ అందుబాటులో ఉందని కంపెనీ స్పష్టం చేసింది. అంతే కాకుండా ఏడబ్ల్యూడీ వేరియంట్‌లో 5 స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్ స్థానంలో 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, నిర్దిష్ట వేరియంట్స్‌లో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ ప్రవేశపెట్టినట్లు వివరించింది.



కొత్త ఫీచర్లతో ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయిన కొత్త టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ప్రారంభ ధర రూ. 11.34 లక్షలు (ఎక్స్ షోరూమ్). అయితే ఈ కొత్త కారు డిజైన్, ఫీచర్స్, ఇంజిన్ ఆప్షన్లలో ఎటువంటి మార్పులు లేదు. కాబట్టి ఈ కారు అదే పని

# మంజుమ్మెల్ బాయ్స్ రికార్డ్ బ్రేక్.. ఆ సినిమా మాత్రం ఇంకా..!



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన తాజా చిత్రం ఎల్2: ఎంపురాన్. ఈ మూవీకి సలార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించారు. 2019లో వచ్చిన లూసిఫర్‌కు సీక్వెల్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఉగాది కానుకగా థియేటర్లలో విడుదలైన ఎంపురాన్ బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. తొలిరోజే పాజిటివ్ టాక్ అందుకున్న ఈ మూవీ.. మలయాళ ఇండస్ట్రీలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ మూవీ రిలీజైన 12 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 257కు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా నెట్ కలెక్షన్స్ సాధించింది. ఈ వసూళ్లతో ఎల్2 ఎంపురాన్ 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన రెండో ఇండియన్ సినిమాగా నిలిచింది. అంతేకాకుండా మలయాళంలో ఆల్‌టైమ్ అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా రికార్డ్ సృష్టించింది. అయితే ఈ సినిమా 2018 మూవీ రికార్డ్‌ను మాత్రం అధికగమించలేకపోయింది. అయితే 2023లో విడుదలైన 2018 సినిమా కేరళ వ్యాప్తంగా రూ.88.7 కోట్లు రాబట్టగా.. ఎంపురాన్ ఇప్పటి వరకు కేవలం రూ.80 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఈ విషయంలో 2018 మూవీని ఎల్2 ఎంపురాన్ దాటలేకపోయింది. కాగా.. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

# తండ్రికి క్యాన్సర్.. హీరోయిన్ ఎమోషనల్

ఆర్ఎక్స్ 100, మంగళవారం లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించిన పాయల్ రాజ్ పుత్.. మొన్నీమధ్యే టాలీవుడ్ లో నెపోటిజం గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. ఇప్పుడు తన కుటుంబంలో జరిగిన బ్యాడ్ న్యూస్ గురించి బయటపెట్టింది.

తన తండ్రి ఎసోఫెగల్ కార్సినోమా (క్యాన్సర్) బారిన పడ్డారని, ఇప్పుడు ట్రీట్ మెంట్ మొదలుపెట్టామని, తొలి కీమో థెరపీ సెషన్ లోనూ ఆయన పాల్గొన్నారని పాయల్ రాజ్ పుత్ చెప్పుకొచ్చింది. దీని వల్ల తనకు కాస్త భయంగా ఉందని పేర్కొంది. ఆయన త్వరలో కోలుకుంటారని, దానికి మీ ప్రేమ, సపోర్ట్ కావాలని రాసుకొచ్చింది.

ఇంత బాధలోనూ తనని పనిచేసుకోమని, షూటింగ్ కి హాజరవ్వమని చెబుతున్నారని పాయల్ రాజ్ పుత్ చెప్పుకొచ్చింది. ఈ మేరకు తండ్రికి సెలైన్ ఎక్కిస్తున్న ఫొటోని తన ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. దీంతో పలువురు నెటిజన్స్ పాయల్ తండ్రి త్వరగా కోలుకోవాలని కామెంట్స్ పెడుతున్నారు.

పాయల్ తండ్రికి జీర్ణాశయ క్యాన్సర్ వచ్చింది. పాయల్ కెరీర్ విషయానికొస్తే ప్రస్తుతం తమిళంలో రెండు, తెలుగులో ఓ మూవీ చేస్తోంది.

# 13 ఏళ్ల క్రితం కేసు..

## మరోసారి కోర్ట్ ముందుకు

**బాలీవుడ్ హాట్ బ్యూటీ మలైకా అరోరాకు.. ముంబైకి చెందిన న్యాయస్థానం మరోసారి అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దాదాపు 13 ఏళ్ల క్రితం జరిగిన గొడవకు సాక్ష్యంగా కోర్టులో హాజరు కావాలని పదేపదే చెబుతున్నా మలైకా రావట్లేదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.**

**ఏం జరిగిందంటే?**

2012 ఫిబ్రవరి 22న హీరో సైఫ్ అలీఖాన్, కరీన్ కపూర్, మలైకా అరోరాతో పాటు కొందరు ఫ్రెండ్స్.. ముంబైలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్ కి వెళ్లారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ బిజినెస్ మ్యాన్ తో గొడవ జరిగింది. దీంతో సైఫ్.. సదరు బిజినెస్ మ్యాన్ ముక్కుపై గట్టిగా గుద్దాడు. దీంతో విషయం పోలీసు కేసుల వరకు వెళ్లింది.

ఈ గొడవకు కారణమైన సైఫ్ అలీఖాన్ తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేయగా.. వెంటనే బెయిల్ పై బయటకొచ్చేశారు. అయితే ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు కోర్ట్ ఎదుట హాజరు కావాలని మలైకాకు ఈ ఏడాది ఫిబ్రవరి 15న నోటీసులు పంపించారు. కానీ రాలేదు. తాజాగా ఏప్రిల్ 7న హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించిన గైర్హాజరు అయింది. దీంతో

ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం మలైకాకు బెయిలబుల్ అరెస్ట్ వారీ జారీ చేసింది. కోర్టును అగౌరవ పరిచినందుకుగాను కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని సదరు న్యాయస్థానం పేర్కొంది. ఏప్రిల్ 29కి ఈ కేసు వాయిదా పడింది. ఇకపోతే తనతోపాటు వచ్చిన మహిళల్ని దూషించడం వల్లే సైఫ్ దాడి చేశాడని అంటున్నారు. మరి మలైకా నోరు విప్పితే గానీ అసలు నిజం బయటపడదు.



# నీ వెంట నడిచే అవకాశం దక్కినందుకు గర్వంగా ఉంది..



**విమర్శలు ఎక్కుపెట్టినవారితోనే శభాష్ అనిపించుకున్నాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ . గంగోత్రి నుంచి పుష్ప 2 వరకు.. అతడి ప్రయాణం చూసిన ఎవరైనా ఔరా అనాల్సిందే! ఈసారి పాన్ ఇండియాను కాకుండా పాన్ వరల్డ్ బాక్సాఫీస్‌కే ఎక్కుపెట్టాడు బన్నీ. అట్లీతో సినిమా.. దీనికి హాలీవుడ్ టెక్నీషియన్స్ వీఎఫ్ఎక్స్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.**

**గడిచిన ఏడాది కష్టంగా..**

సాదాసీదా హీరో నుంచి ఐకాన్ స్టార్ వరకు సాగిన ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాడు బన్నీ. అయితే ఆయన సంతోషాన్నే కాకుండా కష్టాన్ని కూడా ఇష్టంగా పంచుకుంది భార్య అల్లు స్నేహా రెడ్డి . గడిచిన ఏడాది బన్నీ పుష్ప 2 హిట్‌తో భారీ విజయం అందుకున్నాడు. కానీ అతడు సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రీమియర్‌కు వెళ్లినప్పుడు అక్కడ తొక్కిసలాట జరిగి ఓ అభిమాని మృతి చెందడం.. ఆ కేసు తన మెడకు చుట్టుకోవడంతో ఆ సంతోషమే లేకుండా పోయింది. ఈ కేసులో అల్లు అర్జున్ అరెస్టయి ఒక రాత్రి జైలులో గడపడం అతడి జీవితంలోనే మాయని మచ్చగా మిగిలిపోయింది.

**43వ బర్త్‌డే**

అతడు జైలు నుంచి తిరిగి ఇంటికి చేరుకోగానే స్నేహ చంటిపిల్లలా అతడిని హత్తుకుంది. ఆ సమయంలో కుటుంబాన్ని తనే జాగ్రత్తగా చూసుకుంది. తాజాగా ఆమె అల్లు అర్జున్‌కు సోషల్ మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. నా జీవితంలో ప్రేమను పంచిన నీకు 43వ పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ ఏడాదంతా నువ్వు సంతోషంగా, ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఈ జీవితంలో నీతో కలిసి నడుస్తున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను అంటూ ఓ వీడియో షేర్ చేసింది. అందులో ఫ్యామిలీ సంతోషంగా ఉన్న వీడియో క్లిప్పింగ్స్‌ను పొందుపరిచింది. అలాగే బన్నీతో కలిసి దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి. ఇది చూసిన అభిమానులు బన్నీకి మీరే బలం అని కామెంట్లు చేస్తున్నారు.





## వరుసగా ఐదు వైడ్లు..
# శార్దూల్ ఠాకూర్ చెత్త రికార్డు

**కోల్‌కతాతో జరుగుతున్న మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ వరుసగా ఐదు వైడ్లు వేశాడు.**

ఐపీఎల్ 2025లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ ఓ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. 13 ఓవర్‌లో ఏకంగా ఐదు వైడ్లు వేశాడు. అదీనూ వరుసగా. దీంతో ఈ ఓవర్‌లో మొత్తంగా 13 పరుగులు (వరుసగా 5 వైడ్లు.. 1 1 0 4 2) వచ్చాయి. అలా ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో ఐదు వైడ్లు వేసిన రెండో బౌలర్‌గా శార్దూల్ నిలిచాడు. అయితే ఇదే ఓవర్‌లో చివరి బంతికి అజింక్య రహానె (61; 35 బంతుల్లో) నికోలస్ పూరన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతకుముందు మహ్మద్ సిరాజ్ ఇలా ఒకే ఓవర్‌లో ఐదు వైడ్లు వేశాడు. కానీ, అవి వరుసగా కాదు. 2023లో బెంగళూరుకు ఆడిన సిరాజ్.. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో ఐదు వైడ్లు వేశాడు.






# బరిలో శ్రీవల్లి, సహజ

**బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టెన్నిస్ టోర్నీకి వేళైంది. ఈ పోటీలు మంగళవారం ఆరంభం కానున్నాయి. తెలుగమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, యమలపల్లి సహజ భారత జట్టుకు ఆడుతున్నారు.**
**నేటి నుంచే బిల్లీజీన్ కింగ్ కప్**
**న్యూజిలాండ్‌తో తొలి పోరు**

**పుణె:** బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్ 1 టెన్నిస్ టోర్నీకి వేళైంది. ఈ పోటీలు మంగళవారం ఆరంభం కానున్నాయి. తెలుగమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, యమలపల్లి సహజ భారత జట్టుకు ఆడుతున్నారు. అంకిత రైనా, వైదేహి చౌదరి, ప్రార్థన జట్టులో ఇతర సభ్యులు. మాయ రాజేశ్వరన్ రిజర్వ్ ప్లేయర్. తొలి పోరులో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. బలమైన కివీస్‌పై గెలవాలంటే తీవ్రంగా శ్రమించక తప్పదు. ఆతిథ్య భారత్‌తో పాటు కొరియా, చైనీస్ తైపీ, హాంకాంగ్, న్యూజిలాండ్, థాయ్‌లాండ్ ఈ టోర్నీలో ఆడుతున్నాయి. ప్రతి జట్టు మిగిలిన జట్టుతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్2 జట్లు ప్లేఆఫ్స్ చేరతాయి. గతేడాది కొద్దిలో ప్లేఆఫ్స్ బెర్తును చేజార్చుకున్న భారత్.. ఈసారి అవకాశం వదలకూడదని భావిస్తోంది. 2020లో చివరిగా ప్లేఆఫ్స్ చేరిన భారత్.. లాత్వియా చేతిలో ఓడింది.




# టమాటాలు అమ్ముకునేవారికే మీకన్నా ఎక్కువ తెలుసు: బాసిత్ అలీ

**వరుస వైఫల్యాలతో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో సెలక్షన్ కమిటీ, పీసీబీ మీద మాజీ క్రికెటర్ బాసిత్ అలీ ఆగ్రహం వ్యక్తం చేశాడు.**

అన్ని ఫార్మాట్లలో వరుస వైఫల్యాలతో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. టీ20 వరల్డ్ కప్ 2024 , ఛాంపియన్స్ ట్రోఫీ 2025 లో పేలవ ప్రదర్శన చేసింది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లోనూ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ మీద నిప్పులు చెరిగాడు. ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కేవలం ఒకే ఒక ఫ్రంట్ లైన్ స్పిన్నర్‌తో ఎలా బరిలోకి దిగారని ప్రశ్నించాడు. అలాగే ప్రస్తుత కోచ్ ఆకిబ్ జావేద్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశాడు.

'సెలక్షన్ కమిటీ రాజీనామా చేయాలి. వారికి టీమ్ కూర్పు తెలియదు. ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇప్పటి వరకు వరుస వైఫల్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. టమాటాలు అమ్ముకునే వారికే మీ కన్నా ఎక్కువ పరిజ్ఞానం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన టీమ్‌లో స్పిన్నర్లను ఎందుకు తీసుకోలేదని చివరికి వారు కూడా ప్రశ్నిస్తున్నారు' అని బాసిత్ అలీ చురకలంటించాడు.

ఇదిలా ఉండగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ వరుస ఓటముల నేపథ్యంలో పీసీబీ ఛైర్మన్‌గా తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు వస్తున్న వార్తలను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం ఖండించింది. ఇందులో నిజం లేదని తెలిపింది.

## రహానె రాణించినా కోల్‌కతా గెలవలేదు..
# లఖ్‌నవూదే విజయం

**కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 పరుగుల తేడాతో విజయం సాధించింది.**




**కోల్‌కతా:** ఐపీఎల్ 2025లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. లఖ్‌నవూ నిర్దేశించిన 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసి, విజయానికి నాలుగు అడుగుల దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఓపెనర్లు డికాక్ 15(9), సునీల్ నరైన్ 30 (13) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రహానె 61 (35 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ 45 (29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా ఆడారు. ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ, వికెట్ల మధ్య పరుగులు తీస్తూ మ్యాచ్‌ను నెమ్మదిగా కోల్‌కతా వైపు తిప్పారు.

ఒకానొక దశలో కోల్‌కతా విజయావకాశాలు మెరుగ్గా కనిపించాయి. అయితే, శార్దూల్ ఠాకూర్ వేసిన 13 ఓవర్ మొత్తం మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. మొదటి ఐదు బంతులు ఐదు వైడ్‌లు వేసి చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న శార్దూల్ చివరి బంతికి రహానె వికెట్ తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అప్పటి నుంచి నెమ్మదిగా కోల్‌కతా చేతుల్లో నుంచి లఖ్‌నవూ మ్యాచ్‌ను లాగేసుకుంది. రమణదీప్ సింగ్ (1), రఘువంశీ (5), రస్సెల్ (7) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. రింకూ సింగ్ 38 (15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత్ రాణా 10 (9 బంతుల్లో 2 ఫోర్లు) చివరిలో మెరుపులు మెరిపించిన ఫలితం లేకుండా పోయింది. లఖ్‌నవూ బౌలర్లలో ఆకాశ్‌దీప్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు తీయగా, అవేశ్‌ఖాన్, దిగ్వేష్ సింగ్, రవి బిష్ణోయ్ తలో వికెట్ తీశారు.

వైభవ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మూడే పరుగులు రాగా.. ఆ తర్వాత మార్‌క్రమ్, మార్ష్ దూకుడు మొదలెట్టారు. స్పెన్సర్ జాన్సన్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదారు. జాన్సన్ వేసిన మొదటి రెండు ఓవర్లలో 30 పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా బౌలింగ్‌లో లఖ్‌నవూ ఓపెనర్లు చెరో సిక్స్ బాదారు. నరైన్ బౌలింగ్‌లో మార్ష్ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు స్కోరు 95/0గా నమోదైంది. హాఫ్ సెంచరీకి చేరువైన మార్‌క్రమ్‌ను హర్షిత్ రాణా ఔట్ చేసి కోల్‌కతాకు ఉపశమనాన్ని అందించాడు. అదే ఓవర్‌లో ఫోర్ బాది మార్ష్ అర్ధ శతకం అందుకున్నాడు. తర్వాత వచ్చిన పూరన్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మార్ష్ కూడా దంచికొట్టడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ జోడీ 1115 ఓవర్ల మధ్య ఏకంగా 64 పరుగులు రాబట్టింది. దూకుడుగా ఆడుతున్న మార్ష్‌ను రస్సెల్ వెనక్కి పంపాడు. తర్వాత హర్షిత్ బౌలింగ్‌లో పూరన్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రస్సెల్ వేసిన 18 ఓవర్‌లో పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ ఓవర్‌లో అతను వరుసగా 4, 0, 4, 6, 4, 6 బాదేశాడు. చివరి రెండు ఓవర్లలో 21 పరుగులు వచ్చాయి.



**అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న మిచెల్ మార్ష్ (81; 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకం నమోదు చేశాడు. వన్‌డౌన్ బ్యాటర్ నికోలస్ పూరన్ (87*; 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఐడెన్ మార్‌క్రమ్ (47; 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణా 2, ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టారు.**

## చెన్నైకి వరుసగా నాలుగో ఓటమి..
# పంజాబ్ కింగ్స్ విజయం

**చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన పోరులో పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో గెలుపొందింది.**

**చండీగఢ్:** ఐపీఎల్ 18 లో పంజాబ్ కింగ్స్ మూడో విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 18 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ప్రియాంశ్ ఆర్య (103; 42 బంతుల్లో) శతకంతో చెలరేగాడు. అనంతరం లక్ష్యఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 201 పరుగులకే పరిమితం అయింది. డేవాన్ కాన్వే (69; 49 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రిటైర్డ్ ఔట్ అయ్యాడు. శివమ్ దూబె (42; 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (36; 23 బంతుల్లో 6 ఫోర్లు), ధోనీ (27; 12 బంతుల్లో ఒక ఫోర్, 3 సిక్స్‌లు) రాణించినా సీఎస్కేకు ఓటమి తప్పలేదు.









పంజాబ్ బౌలర్లలో ఫెర్గూసన్ 2, మ్యాక్స్‌వెల్, యశ్ ఠాకూర్ ఒక్కో వికెట్ తీశారు. చెన్నైకి ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం.

తొలుత పంజాబ్ బ్యాటర్లలో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (103; 42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతకంతో చెలరేగి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ శశాంక్ సింగ్ (52*; 36 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ సాధించాడు. ఎనిమిదో స్థానంలో వచ్చిన మార్కో యాన్సెన్ (34*; 19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ డకౌట్ కాగా.. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (9), స్టాయినిస్ (4), నేహల్ వధేరా (9), మ్యాక్స్‌వెల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. సీఎస్కే బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2, అశ్విన్ 2, నూర్ అహ్మద్, ముకేశ్ చౌదరి చెరో వికెట్ పడగొట్టారు.